అగ్నివీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): భారత వాయుసేన 12 ఎయిర్‌మన్ సెలక్షన్ సెంటర్ (సికింద్రాబాద్) ద్వారా క్లర్క్, టెక్నికల్ క్యాడర్లలో అగ్నివీర్ వాయు పోస్టులకు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటీఐ లేదా డిప్లొమ (పాలిటెక్నిక్) పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఈ నెల 27 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఇచ్ఛాపురం పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో భోగి మంట వద్ద విద్యార్థుల సందడి

ముందే వచ్చిన సంక్రాంతి

జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తు భోగి, సంక్రాంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగ వల్లికలను తీర్చిదిద్దారు. భోగి మంటలు వేసుకొని మంటల చుట్టూ ఉపాధ్యాయులు, విద్యార్థులు నాట్యం చేస్తూ సందడి చేశారు. హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు.

పూర్తి వివరాలు 4వ పేజీలో..


విద్యుత్ వెలుగుల్లో నారాయణ తిరుమల

నేడు వైకుంఠ ఏకాదశి

- ముస్తాబైన ఆలయాలు

వైకుంఠ ఏకాదశి వేడుకలకు జిల్లాలోని వైష్ణవాలయాలు సిద్ధమయ్యాయి. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి, శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని ఉన్న నారాయణ తిరుమల ఆలయాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. అలాగే, పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం, కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి, చిన్న బజారులోని దూది వారి కోవెల వెంకటేశ్వర స్వామి, శివబాలాజీ ఆలయాలను పూలదండలతో అలంకరించారు. ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, కౌంటర్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం వేకువజాము నుంచే ఉత్తర ద్వారం ద్వారా స్వామివార్ల దర్శనానికి విడిచి పెట్టనున్నారు.

పూర్తి వివరాలు 4వ పేజీలో..

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 'రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించకుండా కొందరు అధికారులు ఆలస్యం చేస్తున్నారు. వారి అలసత్వం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది తక్షణం ఆపాలి. లేదంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.'అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. జడ్పీ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'గ్రీవెన్స్ నోడల్ అధికారి, రెవెన్యూ నోడల్ అధికారి, కంప్యూటర్ ఆపరేటర్లు సమన్వయంతో పనిచేయాలి. రైతుల సమస్యలను తొందరగా పరిష్కరించాలి. వీఆర్వోలు తమ బాధ్యతను సకాలంలో పూర్తి చేయాలి. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు రశీదులు ఇవ్వాలి. వాటిని ఆన్‌లైన్ చేయాలి. అర్జీదారుల ఫోన్ నెంబర్లను సరిగ్గా నమోదు చేయాలి. కలెక్టరేట్‌లో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, అర్జీదారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం గురించి తెలియజేయాలి.' అని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ఉపకలెక్టర్లు ఎం.అప్పారావు, బి.పద్మావతి, లావణ్య, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది కొరత.. పరికరాలు వృథా..

- రోగులకు అరకొర సేవలు
- శవాగారంలో ఫ్రీజర్లూ లేవు
- 900 పడకలకు రెండే అంబులెన్స్‌లు
- ఇదీ శ్రీకాకుళం రిమ్స్‌లో పరిస్థితి

ఆ ఆస్పత్రి జిల్లాలో కీలకమైనది. తమ ప్రాణాలు నిలుస్తాయని ఆశతో రోగులు, ఉత్తమ చికిత్స, వసతులు అందుబాటులో ఉంటాయని వైద్యులు ఇక్కడకే కేసులు రిఫర్ చేస్తుంటారు. పేరుకే అది పెద్దాసుపత్రి అయినా సేవలు మాత్రం ఆ స్థాయిలో అందడం లేదు. ఇక్కడ అడుగడుగునా సమస్యలు దర్శనమిస్తున్నాయి. ఒకపక్క సిబ్బంది కొరత, మరోపక్క వృథాగా పడిఉన్న పరికరాలతో రోగులకు అరకొరగా సేవలు అందుతున్నాయి. మార్చురీలో ఫ్రీజర్లు లేక మృతదేహాలకు పురుగులు పడుతున్నాయి. అంబులెన్స్‌లు, వీల్‌చైర్లు, స్ట్రెచర్లు, మరుగుదొడ్లు..ఇలా అన్నీ కొరతే. ఇదీ శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్) పరిస్థితి.



అరసవల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో సమస్యలు తిష్టవేశాయి. 900 పడకలు గల ఈ ఆసుపత్రిలో 32 వార్డులు, 8 ఐసీయూలు ఉన్నాయి. ఒక్కో వార్డులో రోజుకు మూడు షిఫ్టుల్లో పనిచేసేందుకు గాను కనీసం ముగ్గురు, ఐసీయూలో పని చేసేందుకు ఆరుగురు చొప్పున వైద్య సిబ్బంది ఉండాలి. మొత్తం 32 వార్డులకు గాను కనీసం 96 మంది, 8 ఐసీయూలకు 48 మంది ఎంఎన్‌వోలు అవసరం. కానీ, ఆసుపత్రి మొత్తానికి కేవలం 28 ఎంఎన్‌వోలు మాత్రమే ఉన్నారు. 116 మంది సిబ్బంది కొరత. కేవలం 28 మందితోనే అత్యున్నత సేవలు ఎలా అందిస్తారో అర్థంకావడం లేదు. అలాగే, ఆసుపత్రిలో 14 విభాగాలు ఉండగా 8 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు మాత్రమే ఉన్నారు. వీరంతా సూపరిం టెండెంట్ ఆఫీసులోనే పని చేస్తున్నారు. మిగిలిన విభాగాల్లో కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఇతర ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు. విభాగానికి ఒకరు చొప్పున 14 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమిస్తే పూర్తి స్థాయిలో సేవలందించేందుకు అవకాశం ఉంటుంది.


స్టోర్ రూమ్‌లో వృథాగా పడిఉన్న వైద్య పరికరాలు

మూలకు చేరిన వెంటిలేటర్లు, కాన్సంట్రేటర్లు

కొవిడ్ సమయంలో రిమ్స్‌కు పెద్ద ఎత్తున వెంటిలేటర్లు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు వచ్చాయి. కొవిడ్ అనంతరం వాటి వినియోగం పూర్తిగా తగ్గిపోవడంతో ఆ పరికరాలను మూలన పడేశారు. దాంతో అవన్నీ ఇప్పుడు పనిచేయని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి మొత్తానికి పూర్తి సామర్థ్యంతో కేవలం 8 నుంచి 10 వెంటిలేటర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. మరో 80 పరికరాలు నిరంతరం బాగు చేయడం, మరమ్మతులకు గురవడం జరుగుతోంది. ఆసుపత్రికి కనీసం 50 వెంటిలేటర్లు అవసరం ఉంది. ఆక్సిజన్ ప్లాంట్లలో మూడు నిరుపయోగంగా ఉన్నాయి. 8 కొత్త ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను కనీసం వాడకుండా మూలన పడేశారు. మరో 37 కాన్సంట్రేటర్లు కూడా వృథాగా ఉన్నాయి. వీల్ చైర్లు, స్ట్రెచర్లకు కూడా కొరత ఉంది. 900 పడకల ఆసుపత్రిలో రెండు అంబులెన్స్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రోగులను తీసుకువచ్చేందుకు, తరలించేందుకు ఇవి సరిపోవడం లేదు. మరో రెండు అంబులెన్లను కేటాయించాల్సిన అవసరం ఉంది. గతంలో ఉన్న అంబులెన్స్‌లు పూర్తిగా మూలకు చేరాయి.

మృతదేహాలకు పురుగులు..

ఆసుపత్రి శవాగారంలో ఫ్రీజర్లు పనిచేయడం లేదు. మృతదేహాలను భద్రపరిచేందుకు ఎటువంటి సదుపాయం లేకపోవడంతో, అనాథ శవాలు, లేదా గుర్తింపు లేని శవాలకు పురుగులు పడుతున్నాయి. మార్చురీలోకి వెళ్లేందుకు కూడా మృతుల బంధువులు, స్నేహితులు (మిగతా 4వ పేజీలో..)

ఇది రైల్వే బాదుడు!

- ప్రీమియం తత్కాల్ పేరిట వడ్డన
- పండుగ, పర్వదినాల్లో అదే తంతు
- పైగా రద్దీ మార్గాలంటూ కొత్త నినాదం
- ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు

ఇచ్ఛాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తక్కువ చార్జీతో పాటు తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుకోవచ్చని పండుగ వేళల్లో ఎక్కువ మంది రైళ్లను ఆశ్రయిస్తుంటారు. ప్రయాణికుల అవసరాన్ని రైల్వే అలుసుగా తీసుకుని బాదుడుకు దిగుతోంది. సాధారణంగా ఏ సమయంలోనైనా రైల్వే టిక్కెట్ ధరలు స్థిరంగా ఉంటాయన్నది ప్రజల నమ్మకం. కానీ రైళ్లలో సైతం కనికట్టు చేస్తున్నారు. పండుగలు, ప్రత్యేక పర్వదినాలు, రద్దీగా ఉన్న రూట్ల పేరు చెప్పి దండిగా వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకూ ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు ట్రావెల్స్‌లోనే టిక్కెట్ల ధర పెంపు చూశాం. ఇప్పుడు రైళ్లలోనూ అదే పంథా కొనసాగుతోంది. ప్రస్తుతం సంక్రాంతి సీజన్ నడుస్తోంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయి, కోల్‌కతా నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. ఇది మంచిదే అయినా.. ప్రీమియం తత్కాల్, తత్కాల్ పేర్లతో అదనపు వసూళ్లకు దిగుతుండడాన్ని అందరూ తప్పుబడుతున్నారు.



వెయిటింగ్ లిస్టు చూపి..

ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విశాఖకు సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక రైళ్లు నడుస్తున్నాయి. ఈ రెండు రూట్ల మధ్య త్రీటైర్ ఏసీ టిక్కెట్ ధర అక్షరాలా రూ.770. అయితే ముందస్తు బుకింగ్‌లో భాగంగా రైల్వే అధికారిక వెబ్‌సైట్ ఐఆర్‌సీటీసీలో వెయిటింగ్ లిస్టు చాంతాడు ఉంది. దాని పక్కనే టిక్కెట్ ధర రూ.1800 నుంచి రూ.2000 వరకూ ఉంటోంది. 80 శాతం కన్ఫర్మ్ అయ్యే చాన్స్ ఉంటుందంటూ చెబుతోంది. దీంతో అవసరం మనది కనుక.. బయట బస్సుల్లో అంతకంటే ఎక్కువ టిక్కెట్ ధర ఉండడంతో ఇట్టే బుక్ చేస్తున్నారు. ఇక ఫస్ట్ క్లాస్ ఏసీ, టూటైర్ ఏసీ టిక్కెట్ల విషయంలో ముందస్తు బుకింగ్ చేసుకుంటూ మూడింతలు అదనంగా వసూలు చేస్తున్నారు.

తగ్గిన సేవాభావం..

గత కొంతకాలంగా రైల్వేశాఖలో సేవాభావం తగ్గింది. ఇప్పటి వరకూ గూడ్స్ రవాణాలో ఆదాయమార్గాలను చూసుకునేది. ప్రజా రవాణా విషయంలో కాస్తా వెసులబాటు ఇచ్చేది. టిక్కెట్ ధరలు కూడా అదుపులో ఉండేవి. ఇప్పుడు పూర్తిగా వ్యాపార ధోరణిలోకి మారిపోయినట్టు కనిపిస్తోంది. అచ్చం ప్రైవేటు ట్రావెల్స్ మాదిరిగా వ్యవహరిస్తోంది. ఆదాయం తక్కువ వస్తున్నాయని చెప్పి ప్యాసింజర్ రైల్ సర్వీసులను నిలిపివేసింది. కొవిడ్ తరువాత దాదాపు సూపర్ ఫాస్టు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పెంచిన రైల్వేశాఖ ప్యాసింజర్ల విషయంలో (మిగతా 6వ పేజీలో..)

ప్రైవేటు బస్సుల దోపిడీ

- ప్రయాణికుల జేబులు గుల్ల

రణస్థలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వేళ ప్రైవేట్ బస్సుల యజమానులు ప్రయాణికులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని అదనపు చార్జీలు వసూలు చేస్తూ వారి జేబులను గుల్లచేస్తున్నారు. ఏకంగా టిక్కెట్‌పై మూడు, నాలుగు రెట్లు వసూలు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా కేంద్రం శ్రీకాకుళం నుంచి హైదరాబాద్, విజయవాడ, నెల్లూరు, చెన్నై వంటి నగరాలకు ట్రావెల్ బస్సులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. సంక్రాంతి దృష్ట్యా రైల్వే శాఖ ఉత్తరాంధ్రకు ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. ఆర్టీసీ సైతం వేల సర్వీసులను నడుపుతున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే అవి హౌస్‌ఫుల్ అయ్యాయి. దీంతో ఎక్కువ మంది సొంతూళ్లకు వచ్చేందుకు ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తున్నారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి శ్రీకాకుళానికి రూ.1800 వరకూ టిక్కెట్ ఉంటుంది. కానీ ఇప్పుడు రూ.4 వేలకు పలుకుతోంది. అలాగే, మచిలీపట్నం నుంచి శ్రీకాకుళానికి సాధారణ రోజుల్లో రూ.800 టిక్కెట్ ఉండగా.. ఇప్పుడు రూ.1500 చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ విషయంలో ట్రావెల్స్ యజమానులు సిండికేట్ అయినట్టు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా రవాణా శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



సుదూర ప్రాంతాలకు వెళ్లని ఆర్టీసీ సర్వీసులు..

జిల్లాలోని పలాస, టెక్కలి డిపోలతో పాటు శ్రీకాకుళం రెండు డిపోల నుంచి సంక్రాంతికి ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశారు. ఒక్క శ్రీకాకుళం నుంచే విజయవాడకు 8, రాజమండికి 5, అమలాపురానికి 15 సర్వీసులు అదనంగా నడుపుతున్నారు. ఇటు విశాఖకు, అటు ఇచ్ఛాపురం వెళ్లేందుకు ప్రతి 10 నిమిషాలకు ఒక సర్వీసును నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు చెబుతు న్నారు. పైగా ఈసారి ముందస్తుగా బుక్ చేసుకున్న వారికి టిక్కెట్‌పై 10 శాతం రాయితీ ఇస్తున్నారు. అయితే సుదూర ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది.అందుకే ఎక్కువ మంది ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తున్నారు.

సాధారణ చార్జీలు వసూలు చేస్తున్నాం

ఈ నెల 11,12,13 తేదీల్లో హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం నగరానికి ఏసీ స్లీపర్ క్లాస్ బస్సులను నడుపుతున్నాం. సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నాం. ముందస్తుగా బుక్ చేసుకునేవారి 10 శాతం రాయితీ కూడా అందిస్తున్నాం. తిరుగు ప్రయాణాల సమయంలోనూ అదనపు సర్వీసులను తిప్పుతాం.

-అమరసింహుడు, శ్రీకాకుళం డిపో మేనేజర్

నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

- ఈ నెల 19 వరకు బడులు మూత
- విద్యార్థుల కోసం ప్రణాళిక
- ప్రైవేట్ స్కూళ్లు తెరిస్తే చర్యలు: డీఈవో

4లో

దేహదారుఢ్య పరీక్షల్లో 253 మంది అర్హత

- పర్యవేక్షించిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

4లో

ఆకట్టుకుంటున్న గంగిరెద్దులు

- వీధుల్లో సందడి చేస్తున్న వైనం

4లో

ముందే వచ్చిన సంక్రాంతి

- పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా వేడుకలు
- సంప్రదాయ వస్త్రధారణలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


కవిటి: కవిటి కొత్తూరు పాఠశాలలో విద్యార్థుల వేషధారణ


సంతబొమ్మాళి: హరిదాసు, జంగమయ్యల వేషధారణలో..


పొందూరు: తోలాపి పాఠశాల వద్ద..


నరసన్నపేట: సోది చెబుతానంటున్న చిన్నారి

ప్రభుత్వ పాఠశాలలు... జూనియర్, డిగ్రీ కళాశాలలు గురువారం సంక్రాంతి సంబరాలకు వేదికలయ్యాయి. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ వేడుకలను నిర్వహించారు. హరిదాసులు... డూడూ బసవన్నలు... ఎడ్ల బండ్లు... భోగి మంటలు... జంగమయ్యల వేషధారణలతో విద్యార్థినీ విద్యార్థులు ఆకట్టుకున్నారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలను రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు అచ్చ తెలుగు సంప్రదాయ దుస్తులతో ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొన్నిచోట్ల కోలాటం, జానపద గీతాల వంటివి ప్రదర్శించగా... మరికొన్ని చోట్ల గాలిపటాలు ఎగురవేస్తూ పిల్లలు సందడి చేశారు. సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.


టెక్కలి: చాకిపల్లిలో గొబ్బెమ్మల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న విద్యార్థులు


జి.సిగడాం: ఎడ్ల బండిపై సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు


కంచిలి: కత్తివరం పాఠశాలలో బొమ్మల కొలువు


ఆమదాలవలస: తొగరాం డిగ్రీ కళాశాలలో...


వజ్రపుకొత్తూరు: పెదవంక పాఠశాలలో ...

నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

- ప్రైవేటు పాఠశాలలు తెరిస్తే చర్యలు: డీఈవో

టెక్కలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ప్రకటించింది. శుక్రవారం నుంచి ఈ నెల 19 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయి. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఇళ్ల బాట పట్టారు. జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సుమారు 3 లక్షల 20వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

విద్యార్థుల కోసం ప్రణాళిక..

విద్యా శాఖ యంత్రాంగం ఈసారి సంక్రాంతి సెలవుల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ రోజులు మినహా మిగిలిన రోజుల్లో ఆసక్తి గల విద్యార్థులకు కార్యక్రమాలు రూపొందించారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుకునే విద్యార్థులు ముఖ్యమంత్రికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు, జిల్లా ఉన్నతాధికారులకు ఇలా ఎవరికైనా ఏదైనా ఒక సామాజిక సమస్యపై లేఖ రాయవలసి ఉంటుంది. పండుగకు ఏ ఊరు వెళ్లారు? ఆ ఊరి విశేషాలేమిటి? అన్న అంశాలను కూడా విద్యార్థులు పాఠశాల తెరిచిన సమయంలో రాసి.. అందించవచ్చునన్నారు. బయాలజీ, ఇతర ముఖ్య సబ్జెక్టులకు సంబంధించి ఔట్‌లైన్ మ్యాప్ పాయింట్లను విద్యాశాఖ యంత్రాంగం విద్యార్థులకు ముందుగా అందించనుందన్నారు. విద్యార్థులు మ్యాప్ పాయింట్లు గుర్తించగలగాలి. సుమారు 25 మ్యాప్ పాయింట్లు గుర్తించగలిగితే ఉత్తీర్ణతకు దోహదపడుతుందన్నారు. సంసిద్ధం వ్యక్తం చేసిన పదో తరగతి విద్యార్థులకు సంబంధించి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించవచ్చన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు బలవంతం లేదన్నారు. ప్రతి విద్యార్థికి సెల్ఫ్‌ఎసెస్‌మెంట్ ఫారం కూడా అందజేస్తున్నామని తెలిపారు. సంక్రాంతి సెలవుల్లో ఎనిమిది మార్కుల ప్రశ్నలు, నాలుగు మార్కుల ప్రశ్నలు, రెండు మార్కులు, ఒక మార్కు ప్రశ్నలకు ఆయా సబ్జెక్టుల్లో నేర్చుకోవడం, బడులు తెరచిన తరువాత ఏమి నేర్చుకున్నారో తెలుసుకోవడం విద్యాశాఖ వంతు కానుందన్నారు. విద్యార్థులను ఎ,బి,సి,డిలుగా విభజిస్తామన్నారు. సీ డీ విభాగాల్లో ఉన్న విద్యార్థులకు దత్తత తీసుకుంటారని వివరించారు. అవసరమైతే ఉపాధ్యాయులు ఆ విద్యార్థుల గృహసందర్శన, యోగక్షేమాలతో పాటు అవగాహన కల్పిస్తామని డీఈఓ తెలిపారు.


సంరక్షకులతో కలసి ఇళ్లకు బయలుదేరిన వసతిగృహ విద్యార్థులు

చర్యలు తప్పవు..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కచ్చితంగా సెలవులు అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పాఠశాలలు తెరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముక్కోటి ఏకాదశికి సర్వం సిద్ధం

టెక్కలి/అరసవల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి వేడుకలకు జిల్లాలోని వివిధ ఆలయాలు సిద్ధమయ్యా యి. వైష్ణవాలయాల్లో వైకుంఠ ద్వార దర్శనానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. టెక్కలిలోని పట్టుమహా దేవి కోనేరు గట్టుపై గల వైభవ వేంకటేశ్వర స్వామి ఆల యం, మెయిన్ రోడ్డులో గల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, నంబాలపేటలో గల వేంకటేశ్వర, తొలుసూరుపల్లి రోడ్డులో గల శ్యామసుందర స్వామి ఆలయాల్లో శుక్రవారం వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆ ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. పట్టుమహాదేవి కోనేరు గట్టుపై ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, వసంతోత్సవం, సాయంత్రం దర్బారు సేవ నిర్వహించనున్నట్టు వివరించారు. శ్రీకాకుళంలోని నారాయణ తిరుమల, అరసవల్లి ఆదిత్యాలయం తదితర చోట్ల దర్శనానికి ఏర్పాట్లు చేశారు.


టెక్కలి: వైభవ వేంకటేశ్వర ఆలయంలో అలంకరణ


శ్రీకాకుళంలోని రమ్య తిరుమలలో విద్యుత్ కాంతులు


శ్రీకాకుళం: నారాయణ తిరుమలలో...



అరసవల్లి ఆదిత్యుని ఆలయంలో వైకుంఠ ద్వారం


నగరంలో గంగిరెద్దులను తిప్పుతూ..

ఆకట్టుకుంటున్న గంగిరెద్దులు

- వీధుల్లో సందడి చేస్తున్న వైనం

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ నేపథ్యంలో నగరంలో గంగిరెద్దుల వారు సందడి చేస్తున్నారు. 'అయ్య గారికి దండం పెట్టు..' అంటూ గంగిరెద్దులతో విన్యాసాలు చేయిస్తున్నారు. ఎద్దులకు మువ్వలు, మెడలో హారాలు, పూలదండలతో అలంకరించి వీధుల్లో తిప్పుతున్నారు. ఇంటింటికీ వెళ్లి.. పాటలు పాడుతూ... గంగిరెద్దులతో వివిధ రకాల విన్యాసాలు చేయిస్తూ.. సంక్రాంతి విశిష్టతను వివరిస్తున్నారు. నెలగంటు పడిన మరుసటి రోజు నుంచే జిల్లా వ్యాప్తంగా వీరి సందడి మొదలైంది. సంక్రాంతి సమీపించడంతో మరింత ఉత్సాహంగా తిరుగుతున్నారు. చిన్నపాటి స్టూలు పైన గంగిరెద్దుల నాలుగు కాళ్లను పెట్టి నిలుచునే వైనం ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. అత్యధికశాతం గంగిరెద్దుల వారు కాలి నడకనే తిరుగుతుంటారు. ప్రజలు వీరికి బియ్యం, డబ్బులు, దుస్తులు వంటివి ఇస్తుంటారు. జిల్లాలో సుమారు వెయ్యికి పైగా తమ కుటుంబాలు ఉన్నాయని వీరు చెబుతున్నారు. విజయనగరం విశాఖపట్నంలో కూడా గంగిరెద్దుల కులం వారు అధికంగా ఉన్నారు. వీరి కులదైవం సింహాచలంలో ఉన్న సింహాద్రి అప్పన్న అని మల్లేశం అనే వ్యక్తి తెలిపారు. కార్తీక మాసంలో అమావాస్య రోజున గంగిరెద్దుల సంబరం చేసుకుంటామని వివరించారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పెద్దపాడులోని శ్రీరామ యువజన సంఘం, భజన బృందం ఆధ్వర్యంలో గురువారం మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ భక్తి పాటలతో మేలుకొలిపారు. ఈ నెల 13 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు సంఘ సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఈదు శ్రీనివాసరావు, నక్క ఢిల్లేశ్వరరావు, నక్క కోదండ రామన్న, ఈదు సతీష్ దాసు, పోలారావు తదితరులు పాల్గొన్నారు.


మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

దేహదారుఢ్య పరీక్షల్లో 253 మంది అర్హత


పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

ఎచ్చెర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో గురువారం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో 253 మంది అర్హత సాధించారు. 638 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉంది. కానీ 400 మంది మాత్రమే హాజరయ్యారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన జరగాల్సిన దారుఢ్య పరీక్షలు వాయిదా పడిన కారణంగా ఈ నెల 11న హాజరు కావాలని ఎస్పీ కోరారు.


ఎచ్చెర్ల సాయుధ మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

సిబ్బంది కొరత.. పరికరాలు వృథా..

(మూడో పేజీ తరువాయి)

భయపడుతున్నారు. ఇటీవల 6 బాడీ ఫ్రీజర్లను మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చారు. మరో రెండు ఫ్రీజర్లు పనిచేయడం లేదు. వీటిని అందుబాటులో ఉంచితే పరిస్థితిలో కొంత మార్పు వచ్చే అవకాశం ఉంటుంది.

మరుగుదొడ్లు లేవు..

ఆసుపత్రికి అనుబంధంగా కిడ్నీ రోగుల కోసం ప్రభుత్వ, ప్రజా, ప్రైవేటు విధానంలో నిర్వహిస్తున్న డయాలసిస్ సెంటర్లలో మరుగుదొడ్లు లేవు. 2016 నుంచి నడుస్తున్న ఈ సెంటర్లలో వాడుక నీరు బయటకు వెళ్లేందుకు పైప్‌లైన్ కూడా లేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజుకు కనీసం 40 నుంచి 50 మంది వరకు కిడ్నీ వ్యాధిగ్రస్థులు ఈ సెంటర్లలో డయాలసిస్ చేయించుకుంటుంటారు. ఇప్పటికైనా జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ఈ పరికరాలను అందుబాటులోకి తేవాలి..

ఆసుపత్రిలో డీఆర్ ఎక్స్‌రే మిషన్ ఒక్కటి మాత్రమే ఉంది. మరో మిషన్ అందుబాటులోకి తెస్తే రోగులకు నిమిషాల్లో సేవలందించేందుకు వీలుంటుంది. గర్భిణులకు అత్యున్నత సేవలందించేందుకు అవసరమైన టిఫా స్కాన్ ఇక్కడ లేదు. ఈ సేవల కోసం ప్రైవేటు ఆస్పత్రులపై పైనే ఆధారపడే పరిస్థితి నెలకొంది. స్త్రీలలో కేన్సర్‌ని గుర్తించేందుకు గాను మామ్మోగ్రామ్‌ను అందుబాటులోకి తేవాలి. ఈ పరికరం అందుబాటులో ఉంటే మహిళల్లో బ్రెస్ట్ కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి, వారి ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుంది. అలాగే యాక్సిడెంట్, డెంటల్ కేసుల్లో సత్వర గుర్తింపు కోసం ఓఆర్ డెంటల్ ఎక్స్‌రే పరికరాన్ని కూడా అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.


ఆస్పత్రి పరిసరాల్లో నిల్వ ఉన్న మురుగునీరు

విధి నిర్వహణలో కుప్పకూలి..

● గుండెపోటుతో ఆశ కార్యకర్త మృతి



చంద్రకళ (ఫైల్)

జి.సిగడాం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నిద్దాం గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త కెంబూరి చంద్రకళ (50) గుండెపోటుతో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం గ్రామంలో గర్భిణుల తనిఖీ శిబిరం నిర్వహించారు. దీంతో విధుల్లో భాగంగా గర్భిణుల ఇళ్లకు వెళ్లి శిబిరానికి రావాలని పిలిచింది. ఇదే సమయంలో ఓ వృద్ధురాలికి నొప్పికి సంబంధించిన మాత్రలు ఇచ్చింది. ఈ క్రమంలో గుండెల్లో నొప్పిగా ఉందని కొద్దిగా మంచి నీళ్లు తాగి అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. వెంటనే చంద్రకళను ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించినా అప్పటికే ఆమె మృతి చెందింది. చంద్రకళకు భర్త నక్షత్రక, పిల్లలు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే చంద్రకళ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, పి.సుమబిందు, సీహెచ్‌వో శివప్రసాద్, వైద్య సిబ్బంది, తోటి ఆశా కార్యకర్తలు సంతాపం తెలియజేశారు.

ఇరువర్గాల కొట్లాట.. కేసు నమోదు

ఎచ్చెర్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంబాద్‌లో గురువారం భూ వివాదంలో జరిగిన కొట్లాటపై ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన సీపాన రాజశేఖర్ తనపై అదే గ్రామానికి చెందిన సీపాన సురేష్‌తో పాటు మరికొంతమంది దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే సీపాన సురేష్ కూడా తనపై రాజశేఖర్‌తో పాటు మరికొంతమంది దాడిచేశారని వేరొక ఫిర్యాదు చేశారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

బాహుదా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు

ఇచ్ఛాపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బాహుదానదిలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు చేస్తున్నారే తప్పా.. ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇసుక అక్రమదారులు మరింతగా రెచ్చిపోతున్నారు. నదిలో బ్రిడ్జి పక్కనే పెద్ద పెద్ద గోతులు చేసి ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఇసుక కోసం పెద్ద పెద్ద గోతులు చేయడంతో వరదలు వచ్చిన తర్వాత ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక చాలా మంది ప్రమాదాల బారిన పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

చెట్ల కొమ్మలు తొలగింపు



చెట్ల కొమ్మలు తొలగించిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నగర సుందరీకరణలో భాగంగా పాలకొండ రోడ్డులో డివైడర్ పై ఉన్న మొక్కలు తొలగించి రోడ్లపై వదిలేసిన కొమ్మలను నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. మంగళవారం యుద్ధ ప్రాతిపదికన తొలగించిన మొక్కలను బుధవారం రోడ్లపై వదిలేయడంతో వ్యాపారు లకు ఇటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ప్రజల కష్టాలను వివరిస్తూ 'ఆంధ్రజ్యోతి'లో 'ఇప్పుడా చేసేది?' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు గురువారం యుద్ధ ప్రాతిపదికన పాలకొండ రోడ్డులో ఉన్న చెట్ల కొమ్మలను ట్రాక్టర్లలో తరలించి రోడ్డు క్లియర్ చేశారు. దీంతో రెండు రోజులుగా నిలిచిపోయిన వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభం కావడంతో నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం



నగదు అందిస్తున్న భక్తులు

అరసవల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివా రిని శ్రీకాకుళం నగరానికి చెందిన గుడ్ల పవన్ సాయి, గుడ్ల శ్రీనివాసరావు గురువారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి రూ.1,00,111 ఆలయ సూపరింటెండెంట్ కనకరాజుకి అందజేశారు. వారిని ఆలయ అర్చకులు ఆశీర్వదించగా, సూపరింటెండెంట్ స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

మార్గదర్శకాల మేరకు నిధులు వెచ్చించాలి



వర్చువల్ సమీక్షలో పాల్గొన్న వీసీ రజని తదితరులు

ఎచ్చెర్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (పీఎం ఉషా) కింద ఎంపికైన యూనివర్సిటీలు, విద్యా సంస్థలు నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిధులు వెచ్చిస్తే తదుపరి నిధులు మంజూరునకు అవకాశం ఉంటుందని కేంద్ర విద్యాశాఖ అదనపు కార్యదర్శి సునీల్‌కుమార్ బర్న్వేల్ అన్నారు. పీఎం ఉషా కింద ఎంపికైన వర్సిటీల వీసీలు, ఇతర అధికారులతో ఆయన గురువారం వర్చువల్‌లో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని పాల్గొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, పీఎం ఉషా వర్సిటీ సమన్వయకర్త డాక్టర్ టి.సంతోషి పావని తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకం

ఆమదాలవలస, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మాన వాళికి మార్గదర్శి అయిన స్వామి వివేకానంద బోధనలు విద్యార్థు లకు స్ఫూర్తికావాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామసుందర్ అన్నారు. శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ యువజన వారోత్సవాలు నాలుగో రోజు కార్యక్రమాన్ని గురువారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించకారు. కార్యక్రమంలో యువజనోత్సవాలు కన్వీ నర్ మందపల్లి రామకృష్ణారావు, ఎన్ఎస్ఎస్ పీవో జలుమూరు రవిబాబు, కళాశాల అధ్యా పకులు బి.ధనుంజయరావు, కె.రాజారావు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఎచ్చెర్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పాండిచ్చేరిలో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో గురుగుబెల్లి దుర్గా ప్రశాంతి, పొందూరు లావణ్య, బాలుర విభాగంలో పొందూరు హరికృష్ణ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కదిలిండి నరసింహరాజు, కార్యదర్శి చిగిలిపల్లి లక్ష్మీదేవి, కన్వీనర్ వెంకటరామరాజు, ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు, పాఠశాల హెచ్‌ఎం బీవీ సాయిరాం, పీడీ ఎంవీ రమణ తదితరులు అభినందించారు.

మృతుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలి

పొందూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన భక్తుల కుటుంబ సభ్యులకు టీటీడీలో ఉద్యోగం కల్పించాలని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు, కృష్ణాపురం ఆనందాశ్రమ పీఠాధిపతి స్వామి శ్రీనివాసానంద ప్రభుత్వాన్ని కోరారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను రాజకీయం చేస్తున్న పార్టీలపై ఆయన మండిపడ్డారు. ఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెళ్లి తీసుకున్న చర్యలు బాగున్నాయని కొనియాడారు.

మౌలిక వసతులు కల్పించాలి

బూర్జ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): చీడివలస, కొల్లివలస పంచాయతీల పరిధిలోని జగనన్న కాలనీలో గత ప్రభుత్వం మౌలిక వసతులను కల్పించకుండా వదిలేసింది. దీంతో 21 కుటుంబాలు ఇబ్బందిపడుతున్నారు. కాలనీలో కనీస వసతులైన రహదారులు, డ్రైన్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు కొరవడడంతో కూటమి ప్రభుత్వంపైనే కోటి ఆశలు పెట్టుకున్నారు. వెంటనే మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుడికి డీఈవో పరామర్శ

గార, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కొర్లాం ఎంపీపీ స్కూల్‌లో ఎంటీఎస్ టీచర్‌గా పని చేస్తూ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఎంవీ పాపాచారిని గురువారం డీఈవో తిరుమల చైతన్య పరామర్శించారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులు అందజేసిన రూ.90 వేలుతో పాటు తన వంతుగా రూ.10 కలిపి ఆ మొత్తాన్ని పాపాచారికి అందించి మనోధైర్యాన్ని కల్పించారు. ఎంఈవోలు రామకృష్ణ టి.వినోదిని పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి క్రీడల్లో విద్యార్థినుల ప్రతిభ

జి.సిగడాం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రణస్థలంలో నిర్వహించిన డివిజన్‌స్థాయి క్రీడా పోటీల్లో జాడ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్టు హెచ్‌ఎం బెవర రామినాయుడు తెలిపారు. బాలికల కబడ్డీ పోటీల్లో రన్నర్‌గా నిలిచారన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు కె.వెంకటనాయుడు, విద్యార్థినులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



భోగి మంట వేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సూర్య స్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు హాజరయ్యారు. సంప్రదాయాలు, సంస్కృతి కోసం చిన్నతనం నుంచే పిల్లలకు నేర్పడం శుభ పరిణామమన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సీహెచ్ వీరవెంకటరావు, ప్రిన్సిపాల్ జి.సత్యమణి, జోగురాజు మౌళి, పిసిని జగన్నాథం, చంటి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల విజేతలు

కవిటి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నర్తుపుట్టుగ గ్రామంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో హరిపురం జడ్పీ పాఠశాల మొదటి స్థానంలో బొరివంక విద్యార్థులు రెండో స్థానంలో, కవిటి ఒరియా పాఠశాల విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. వీరికి బహుమతులను యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు గ్రామస్థులు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో నర్తు గంగయ్య, బి.ప్రకాష్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా విధులు నిర్వహించండి

శ్రీకాకుళం రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ సిబ్బంది నిర్మాణాత్మక ధోరణితో విధులు నిర్వర్తించాని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ బి.సుధాకరరావు అన్నారు. రాగోలులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, గోకులం నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఇంజనీరింగ్ సిబ్బందితో సమన్వయం చేస్తూ పల్లె పండగ పనులను శతశాతం పూర్తిచేయాలన్నారు. అదే విధంగా ఇంకుడు గుంతలు, ఇతర మెటీరియల్ కాంపోనెట్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జేఈ పి.బాలముకుందబాబు, టీఏ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దొంగలొస్తారు జాగ్రత్త

● టూటౌన్ పోలీసుల వినూత్న ప్రచారం

శ్రీకాకుళం క్రైం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మీ ఇంటికి దొంగలొస్తారు.. జాగ్రత్త అంటూ రెండో పట్టణ పోలీసులు వినూత్నంగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ నెల 9వ తేది నుంచి 16 వరకు స్కూల్స్, కళాశాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో కుటుంబాలతో సొంత గ్రామాలకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాని టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆటోపై 'పండగకి మీ ఇంటికి దొంగలు వస్తారు జాగ్రత్త' అనే బ్యానర్‌రు పెట్టి మైక్‌పై అప్రమత్తం చేస్తున్నారు. ఊరెళ్లే వారు సమాచారం అందిస్తే గస్తీ నిర్వహిస్తామని, ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని కల్పిస్తామని స్పష్టం చేశారు. దీని ద్వారా ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎటువంటి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.



ఆటో ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు

విద్యార్థినుల భోజనశాల ప్రారంభం

ఇచ్ఛాపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ బాలికోన్నత పాఠశాల స్థల దాత కాదా లక్ష్మీకాంతం మనుమడు డాక్టర్ కాదా మన్మధకుమార్ (లండన్) విద్యార్థుల కోసం రూ.6లక్షలు వెచ్చి భోజన శాలను మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ.. ఆడపిల్లల చదువు కోసం మా నాన్నమ్మ స్థలం దానం చేసి ఎంతోమంది ఆడపిల్లలు చదువుకొనేలా చేశారన్నారు. అయితే మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు నా దృష్టికి వచ్చాయని, అందుకే విద్యార్థుల కోసం భోజన శాల నిర్మాణం చేయించానన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి, యాదవ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, ఎస్ఎంసీ చైర్మన్ గిన్ని వెంకటరమణ, కాదా కుటుంబ సభ్యులు తదితరులు

కాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా 'శవ్వాన'

అరసవల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా శవ్వాన వెంకటేశ్వరరావును నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణ నాయుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు తెలిపారు.

● సరుబుజ్జిలి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జాతీయ కాపు సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల ప్రధాన కార్యదర్శిగా సరుబుజ్జిలి గ్రామానికి చెందిన వేల్పుల గోవిందరావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణనాయుడు నుంచి ఉత్తర్వులు గోవిందరావుకు అందాయి. కాగా గోవిందరావు ప్రస్తుతం బీజేపీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు కానుకలు

కవిటి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ కవిటిలోని పారిశుధ్య కార్మికులకు సంక్రాంతి కానుకలను గురువారం సర్పంచ్ పి.లక్ష్మణరావు కార్మికులకు వీటిని అందించారు. పారిశుధ్యకార్మికుల కుటుంబాల్లోను సంక్రాంతి వెల్లివిరియాలని కోరుతూ వీటిని అందించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో వీరభద్రస్వామి, రవికిరణ్, నూకరాజు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గార, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తూలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ల మరమ్మతు దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఆ శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు (ఆపరేషన్స్) గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో గార, బూరవిల్లి, కొర్లాం, తూలుగు, నిజామాబాద్, సతివాడ, మొగదాలపాడు తదితర గ్రామాలకు సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్రాంతి సెలవులు అమలు చేయాలి

అరసవల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 10 నుంచి 19 వరకు సంక్రాంతి సెలవులు పక్కాగా అమలు చేయాల్సిందేనని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధితులకు వైద్యం

పొందూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం కస్పావీధిలో నాలుగు రోజుల కిందట ప్రబలిన డయేరియా పంచాయతీ అధికారులు, వైద్యులు, సిబ్బంది అదుపులోకి తెచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో నలుగురు పాతరోగులే చికిత్స పొందారు. కస్పావీధితో పాటు సమీప వీధుల్లోను గురువారం ముమ్మర పారిశుధ్య పనులు నిర్వహించారు. ట్యాంకర్లతో సురక్షిత తాగునీటిని సరఫరా చేశారు.

కూటమి నేతలు తరలిరావాలి

జి.సిగడాం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం నుంచి రాజాం ప్రధాన బీటీ రహదారికి ఆనుకుని ఉన్న ఆర్అండ్‌బీ రహదారి నిర్మాణం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్టు కూటమి నాయకులు తెలిపారు. పాలఖండ్యాం కూడలి నుంచి నిద్దాం, అద్వానంపేట మీదుగా స్థానిక రైల్వే స్టేషన్ వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు తెలిపారు. అలాగే పాలఖండ్యాంలో నిర్మించిన గోకులం షెడ్డు ప్రారంభించనున్నట్టు తెలిపారు. కూటమి నాయకులు హాజరుకావాలని కోరారు.

తిరుపతి ఘటన బాధాకరం

రణస్థలం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనలో ఆరుగురి ప్రాణాలు పోవడం చాలా బాధాకరమని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జడ్పీటీసీ టొంపల సీతారాముడు అన్నారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. తిరుపతి దేవస్థానం చరిత్రలో ఎన్నడూ ఇలాంటి ఘటన జరగలేదన్నారు. ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ పాలక మండలి బాధ్యతవహించాలన్నారు

భూసార పరీక్షలతో మేలు

పొందూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టుసాగులో అధిక దిగుబడి సాధించాలంటే పట్టుసాగు చేసేముందు భూసార పరీక్షలు విధిగా నిర్వహించాలని రాష్ట్ర పరిశోధనామండలి (హిందూపురం) శాస్త్రవేత్త, రీసెర్చ్ అసిస్టెంట్స్ సి.రమేష్‌బాబు, జె.సీతారాములు అన్నారు. మలకాం గ్రామంలో పట్టు రైతులకు గురువారం పట్టుసాగుపై అవగాహన కల్పించారు. సాగుపై వారికి పలు సూచనలు, సలహాలు అందించారు.

ధాన్యం వ్యాపారి దుర్మరణం


కృష్ణారావు (ఫైల్)

పాతపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరసవాడ ముత్యాలమ్మ ఆలయం ఎదురుగా 326ఏ జాతీయరహదారిపై లగేజీ వ్యాన్, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ధాన్యంవ్యాపారి మారెడ్ల కృష్ణారావు (55) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు..గురువారం మండలంలోని చాకిపల్లికి చెందిన ధాన్యంవ్యాపారి మారెడ్ల కృష్ణారావు సీదికూడలి నుంచి కొరసవాడ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. అదే సమయంలో నిమ్మాడ నుంచి రాతి రుబ్బురోళ్లు తిరగళ్లతో వచ్చే లగేజీవ్యాన్ వస్తోంది.ఈ రెండు కొరసవాడ ముత్యాలమ్మ ఆలయం ఎదురుగా గల 326ఏ జాతీయరహదారిపై ఢీకొన్నాయి. దీంతో మారెడ్ల కృష్ణారావు అక్కడికక్కడే మృతిచెందాడు. సడన్ బ్రేకులు వేయడంతో లగేజీవ్యాన్ జాతీయరహదారికి అడ్డంగా బోల్తాపడింది. సమాచారం తెలియడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ ఎ.రామారావు పరిశీలించి, దర్యాప్తు ప్రారంభించారు. కృష్ణారావు భార్య నీలవేణి ఆర్మీ, నేవీలో పనిచేసే తిరుపతిరావు, నవీన్ ఉన్నారు. కృష్ణారావు భార్య నీలవేణి ఇచ్చిన ఫిర్యాదుమేరకు మెళియాపుట్టి ఎస్ఐ పి.రమేష్‌బాబు కేసునమోదుచేశారు. స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

టెక్కలి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లపేట గ్రామానికి చెందిన సీహెచ్ తిరుపతిరావు(42) చికిత్సపొందుతూ మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గురువారం తిరుపతిరావు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అయితే మెరుగైన వైద్యం కోసం తిరుపతిరావును శ్రీకాకుళం రిఫర్ చేశారు. తరలించే ఏర్పాట్లుచేస్తుండగా మృతిచెందాడు. తిరుపతిరావు ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన భార్య భానుమతి రోదిస్తోంది.

కంట్లో కారం కొట్టి.. మూతికి గుడ్డ కట్టి..

● పోలవరంలో మహిళ మెడలో నుంచి బంగారం చోరీ

టెక్కలి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరంలో బుధవారం అర్ధరాత్రి తర్వాత ఓ మహిళ కంట్లో కారం కొట్టి నాలుగు తులాల బంగారం చోరీకి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసుల కథనం మేరకు..పోలవరంరజకవీధి సమీపంలో సాయిరాం మందిరానికి ఎదురుగా గోరింట జగం భార్య స్వప్నకుమారి నివసిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు రాత్రి రెండు గంటల సమయంలో ఇంటిపెరటి భాగంలో గల బాత్‌రూముకు స్వప్నకుమారి వెళ్లింది. తిరిగి వస్తుండగా అప్పటికే మేడ మెట్లుపై దాగిఉన్న వ్యక్తి ఒక్కసారిగా స్వప్నకుమారిపై దాడిచేసి కంట్లో కారం కొట్టాడు.చేతులపై కాళ్లు పెట్టి, మూతికి గుడ్డ కట్టి మెడలో ఉన్న మూడుతులాల పుస్తెలతాడు, తులం నల్లపూసలు దండ చోరీ చేసి అక్కడ నుంచి పారిపోయాడు. ఈలోగా ఆమె తేరుకొని కేకలు వేయడంతో కుటుంబసభ్యులు ఆ ప్రాంతంలో గాలించారు. ఈ విషయమై గురువారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి చోరీఘటనపై ఆరాతీశారు. స్వప్నకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

90 మద్యం సీసాల స్వాధీనం

ఎచ్చెర్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): భగీరథపురం గ్రామానికి చెందిన బగ్గు ఈశ్వరరావు అనే వ్యక్తిని గురువారం 90 మద్యం సీసాలతో కొంగరాం గ్రామం వద్ద ఎచ్చెర్ల పోలీసులు పట్టుకున్నారు. సుమారు రూ.9 వేలు విలువ చేసే మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఈశ్వరరావును అరెస్టు చేసినట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

పోలీసు లాంఛనాలతో హెచ్‌సీ అంత్యక్రియలు

పొందూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నాయుడువీధికి చెందిన ఏపీఎస్ బి.హెడ్‌కానిస్టేబుల్ నల్లి వెంకటరమణకు స్వగ్రామం పొందూరులో గురువారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పాడేరులో ఏపీఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటరమణ బుధవారం పాడేరులో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందిన విషయం తెల్సిందే. వెంకటరమణ మృతదేహాన్ని కుటుంబస్యులు గురువారం ఉదయం పొందూరు తరలించారు. ఏపీఎస్‌బీ సిబ్బంది శ్మశానవాటికలో గాలిలో కాల్పులు జరిపి నివాళిలర్పించారు.

పోర్టు రోడ్డులో వంశధార కాలువ పరిశీలన


బన్నువాడ ప్రాంతంలో కాలువను పరిశీలిస్తున్న అధికారులు

టెక్కలి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు నిర్మాణానికి సంబంధించి టెక్కలి నుంచి మూలపేట వరకు అవసరమయ్యే 317 ఎకరాల రోడ్డు మార్గంలో వంశధార కాలువ సాగునీరు వెళ్తున్న క్రాసింగ్ ప్రాంతాల్లో గురువారం వంశధార, శ్రీవిశ్వసముద్ర ఇంజనీరింగ్ సంస్థల(పోర్టు) అధికారులు పరిశీలించారు. మదనగోపాలసాగరం 50ఏఆర్ మొదలుకొని 50ఆర్, 49ఆర్, 48ఆర్ తదితర 24చోట్ల బన్నువాడ, ఇజ్జువరం, వేములాడ, టెక్కలి, తలగాం తదితర ప్రాంతాల్లో కాలువలు పరిశీలించారు. ఇప్పటికే ఇంజనీరింగ్ అధికారులు 18చోట్ల క్రాసింగ్‌లు గుర్తించారు. మరో ఆరుచోట్ల అదనంగా కాలువ క్రాసింగ్ పనులు చేపట్టాలని వంశధార టెక్కలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శేఖరరావు పోర్టు ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రైతులకు సాగునీరు ఇబ్బందులు లేకుండా వెళ్లే మార్గాలపై ఆయన సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఆయనతో పాటు డీఈఈలు సుధాకర్, నవీన్, జేఈ భాస్కరరావు, బన్నువాడ నీటి సంఘం అధ్యక్షులు సనపల మురళి, పలు గ్రామాల రైతులు ఉన్నారు.

హౌస్‌హోల్డ్‌సర్వే పూర్తిచేయాలి

పాతపట్నం, జనవరి9(ఆంధ్రజ్యోతి):మిస్సింగ్ సిటిజన్ హౌస్‌హోల్డ్‌సర్వే శతశాతం పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు ఆదేశించారు. పాతపట్నం ఎంపీడీవో కార్యాలయలో సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, ఎనర్జీ అసిస్టెంట్లతో సమీక్షించారు. సమావేశంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో చంద్రకుమారి పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి: డీఎల్‌డీవో


చాపరలో రికార్డులను పరిశీలిస్తున్న గోపిబాల

మెళియాపుట్టి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని టెక్కలి డీఎల్‌పీవో గోపిబాల హెచ్చరించారు. గురువారం కొసమాళ, చాపర గ్రామ సచివాలయాలు తనిఖీ చేశారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో విధి నిర్వహణలో నిర్ల క్ష్యం శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో ఆయన సచివా లయాలు తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటు లేని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని కోరారు. ఆయనతోపాటు కార్యదర్శి చింతల అప్పారావు ఉన్నారు.


జలుమూరు: క్రయవిక్రయదారులతో కిటకిటలాడుతున్న నారాయణవలస సంత


వజ్రపుకొత్తూరు: పూండి వారపుసంతలో సరుకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

సంతల్లో సంక్రాంతి సందడి

● క్రయ విక్రయదారులతో కిటకిట ● పొట్టేళ్లు, నాటు కోళ్లకు గిరాకీ

జిల్లాలోని వజ్రపుకొత్తూరు మండలంలోని పూండి, జలుమూరు మండలంలోని నారాయణవలసలో గురువారం జరిగిన సంతల్లో సంక్రాంతి సందడి నెలకొంది. ఒడిశా, జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్రయ విక్రయదారులతో కిటకిటలాడాయి. ప్రధానంగా పొట్టేళ్లు, నాటు కోళ్లకి గిరాకీ పెరిగింది. దీనిని ఆసరాగా చేసుకుని వ్యాపారులు ధరలుపెంచేశారని వినియోగదారులు వాపోయారు.

జలుమూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) నారాయణవలస సంతకు సంక్రాంతి పురస్కరించుకుని పెద్దసంఖ్యలో వినియోగదారులు తరలివచ్చారు. సంక్రాంతి, కనుమ ముందు సంత కావడంతో పొట్టేళ్లు, మేకపోతులు, నాటు కోళ్లకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. ప్రజలు అవసరాలను వ్యాపారులు ఆసరాగా తీసుకొని కొనుగోలు దారులను ధర పెంచేశారు. 10 కేజీల పొట్టేళ్లు, మేకపోతులు 13 వేలు రూపాయలు పైనే ధర పలికాయి. నాటు కోళ్ల కేజీ రు.800లు ధర పలికింది. కూరగాయలు, చెరుకులు, కొబ్బరికాయలు ధరలు ఆకాశాన్నంటాయి.

● వజ్రపుకొత్తూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పూండి వారపు సంతలో సంక్రాంతి సందడినెలకొంది. ప్రతిగురువారం పూండిలో అయ్యప్ప ఆలయం సమీపంలో వారపు సంతను శతాబ్దకాలంగా నిర్వహిస్తున్న విషయం విదితమే. సంక్రాంతి ముందు వారపు సంత కావడంతో నందిగాం,పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని పలుగ్రామాల ప్రజలు ఉదయం నుంచి తరలివచ్చి సరుకులు కొనుగోలు చేశారు. ఇక్కడకు జిల్లాలోని పలు మండలాల నుంచి వ్యాపారులు సరుకులు, కోళ్లు, మట్టి కుండలు పలు రకాల సామగ్రి తీసుకొచ్చి విక్రయించారు.



పలాసరూరల్: సత్యసాయి విద్యావిహార్‌లో సంక్రాంతి సంబరాలు


వజ్రపుకొత్తూరు:చిన్నారులకు భోగిపళ్లు పోసి దీవిస్తున్న సాయివినీత్ విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ లీలా, కోదండరావు


పలాస: భోగి మంట వెలిగించి సంబరాలు ప్రారంభిస్తున్న ఏటీపీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు

సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

● సంక్రాంతి సంబరాల్లో వక్తల పిలుపు

సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం జిల్లాలో పలు విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ తెలుగు వంటకాలు తయారు చేశారు. తెలుగుదనం ఉట్టిపట్టేవిధంగా దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. అనంతరం సంక్రాంతిముగ్గులు వేశారు. నృత్యాలు, హరిదాసు వేషాలతో విద్యార్థులు పాటలు పాడారు. ఆటలు ఆడారు.

-ఆంధ్రజ్యోతి బృందం

● పలాస,జనవరి 9(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ కార్యక్రమాలన్నీ నిర్విఘ్నంగా కొనసాగాలని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు కోరారు. పలాసలోని మదర్‌థెరిసా విద్యాలయంలో సంక్రాంతి సం బరాలునిర్వహించారు.కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ గంగాభవాని పాల్గొన్నారు.

● వజ్రపుకొత్తూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలని సాయివినీత్ విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ లీలా, వైద్యులు కోదండరావు తెలిపారు. సాయివినీత్ విద్యాసంస్థల ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ శ్రావణి, వైద్యురాలు పూజిత, అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ గొరకల వసంత స్వామి, కర్ని రమణ, సర్పంచ్ పాలిన రమ్య పాల్గొన్నారు.

● పలాసరూరల్,జనవరి 9(ఆంధ్రజ్యోతి):సంప్రదాయాలు కనుమరుగవుతున్న వేళ సంక్రాంతి సంబరాలను నిర్వహించడం గొప్ప విషయమని అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుమ లక్ష్మణరావు, సర్పంచ్ కుత్తుమ రూపవతి తెలిపారు. పలాస మండలంలోని సత్యసాయి విద్యావిహార్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, మల్లా శరత్‌బాబు, ఉపాధ్యాయులు మురళి, అనుదీప్, సాంబమూర్తి, గీతానంద్, మౌనిక పాల్గొన్నారు. అలాగే బ్రాహ్మణతర్లా, సాయికాలనీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు.

ప్రణాళికాబద్ధంగా బోధించాలి: డీవీఈవో


పలాస: మాట్లాడుతున్న తవిటినాయుడు

పలాస, జనవరి 9(ఆంధ్రజ్యోతి):ప్రణాళికాబద్ధంగా కోర్సులను బోధించాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్.తవిటినాయుడు కోరారు. గురువారం పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తనిఖీచేశారు.ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు శ్రమించి ఉత్తమఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సంకల్ప్ కార్యక్రమంలో గ్రేడులుగా విభజించిన తీరును పరిశీలించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నర్సింహమూర్తి, బి.వెంకట మోహన్, పి.చిరంజీవులు, కొండల మధుబాబు పాల్గొన్నారు.

● వజ్రపుకొత్తూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులు ఇప్పటి నుంచే చక్కటి ప్రణాళికలతో ముందుకు వెళ్తే మంచి ఫలితాలు సాధిస్తారని జిల్లా వృత్తివిద్యాధికారి తవిటినాయుడు తెలిపారు.పూండి-గోవిదంపురం జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం, కళాశాలలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌పట్నాయక్ పాల్గొన్నారు.

పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కోటబొమ్మాళి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, పరిసర ప్రాంతాలతోపాటు మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈవో ఎల్వీ ప్రతాప్ కోరారు. కోటబొమ్మాళిలో జరిగిన కార్యక్రమంలో 106 ప్రభుత్వ పాఠశాలల మరుగుదొడ్ల శుభ్ర తకు సంబందించిన మెటీరియల్‌ను హెచ్‌ఎంలకు అందజేశారు.

వంద రోజులు పని కల్పించాలి

కోటబొమ్మాళి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు వందరోజులు పని కల్పించాలని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ కోరారు. గురువారం కోటబొమ్మాళి మండలపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి క్షేత్ర సహాయకులతో శిక్షణనిర్వహించారు. ఈ సందర్భంగాఏపీడీ శైలజ మాట్లాడుతూ క్షేత్రసహాయకులు వేతన దారులకు మారుతున్న సాంకేతకపై అవగాహన కల్పించాలన్నారు.కార్యక్రమంలో డీఎల్‌ఆర్‌సీ వైవీ రమణ,ఏపీవోలు జి.హరి ప్రసాద్, పి.నర్సింహమూర్తి, ఈసీలు టి.రాంబాబు, యు.ధర్మారావు పాల్గొన్నారు.

సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వే

● అటవీశాఖ విజిలెన్స్ విభాగం అధికారులు

పాతపట్నం, జనవరి9(ఆంధ్రజ్యోతి): రిజర్వ్‌ఫారెస్ట్‌లో ఆక్రమణలపై రెవెన్యూ అధికారులతో సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వే చేపడతామని మంగళగిరి నుంచి వచ్చిన అటవీశాఖ డీఎఫ్‌వో విజిలెన్స్-1 సీహెచ్ ధర్మరక్షిత, విజిలెన్స్-2 ఎస్ఎన్ శివకుమార్ తెలిపారు.గురువారం పాతపట్నం అటవీశాఖాధికారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పాతపట్నం అటవీరేంజ్ ఏడు రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 800 ఎకరాల రిజర్వుఫారెస్ట్ ఉందని తెలిపారు. ఇందులో పాతపట్నం పరిధిలో అంతరాబ రిజర్వ్‌ఫారెస్ట్‌పరిధిలోని సుమారు 8.5ఎకరాల్లో పలుచోట్ల ఆక్రమణలు జరిగాయని ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఈ విషయంపై రెవెన్యూఅధికారులతో కలిసి సర్వేలు నిర్వహిస్తామని తెలిపారు.

మాదకద్రవ్యాల గుర్తింపునకు తనిఖీలు

హిరమండలం, జనవరి 9(ఆంధ్రజ్యోతి):మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా,అమ్మకాలను గుర్తించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామని పోలీసులు చెప్పారు. గురువారం హిరమండలంలో పోలీసు జాగిలంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: ఎస్ఐ

ఎల్.ఎన్.పేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి):రహదారులపై వాహనాలు నడిపే వారు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ బి. హైమావతి హెచ్చరించారు.గురువారం మండలంలోని అలికాం-బత్తిలి ప్రధానరోడ్డుపై లక్ష్మీనర్సుపేటజంక్షన్‌లో వాహనాలు తనిఖీచేశారు. ఈ సందర్భంగా 20 మంది ద్విచక్ర వాహనచోదకులపై కేసులు నమోదుచేశామని చెప్పారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

కొత్తూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులతంపర వంశధార నదీతీరంలో అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి కోరారు. నదిలో నిబంధన ఉల్లంఘించి యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని, అక్రమ తవ్వకాలు నిరోధించి రవాణాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఐ చింతాడ ప్రసాద్, తహశీల్దార్ రవిచంద్రలకు ఫోన్‌లో వివరించారు. రవాణాకు ఉపయోగిస్తున్న లారీలను, య్రంతాలను సీజ్ చేయాలని కోరారు.ఈ మేరకు తవ్వకాలను ఆయన అడ్డుకున్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

పాతపట్నం,జనవరి9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని గంగువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శివ తెలిపారు. గురువారం గంగువాడ పీహెచ్‌సీలో పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఆరోగ్య పరీక్షలను చేశారు. ఈసందర్భంగా గర్భిణులకు సారవకోట మండలంలోని చిన్న గుజ్జివాడకు చెందిన శ్రీసత్యసాయిసేవాసమితి జోనల్‌కోఆర్డినేటర్ అన్నయ్యనాయుడు పౌష్టికాహారాన్ని అందజేశారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

పలాస రూరల్, జనవరి9 (ఆంధ్రజ్యోతి):గ్రామాల అభివృద్ధే టీడీపీ-కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండలాధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు తెలిపారు. బొడ్డపాడు పంచాయతీలో ఎన్‌హెచ్-16 జాతీయ రహదారి నుంచి గ్రామదేవత చింతల పోలమ్మ గుడి వరకూ బీటీ రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల అర్జీలు పరిష్కరించాలి

నందిగాం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కారానికి వీఆర్వోలు చొరవ చూపాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సూచించారు. మండలంలో 112 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సులు గురువారం ముగిశాయి.ఈమేరకు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వచ్చిన దరఖాస్తులపై సమగ్ర పరిశీలన జరిపి వాటి ప్రగతి వివరాలు తెలియజేయాలని ఆదేశించారు.సమావేశంలో ఉపతహసీల్దార్ ఆర్.రామారావు, ఆర్ఐ ఇ.సింహాచలం పాల్గొన్నారు.

నేడు 'ఎస్పీ మీకోసం' రద్దు

పలాస, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదిక(మీకోసం) కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలచేశారు పోలీసుకానిస్టేబుళ్ల ఎంపికలు జరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

12న 5కే రన్ పోటీలు

పలాస రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని నీలావతి గ్రామానికి చెందిన ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యువీవీ)ఆధ్వర్యంలో ఈనెల 12న ఉదయం ఆరు గంటలకు జిల్లా స్థాయి 5కె రన్‌పోటీలు నిర్వహించనున్నట్లు యువీవీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గరుడభద్ర నుంచి ప్రారంభమై నీలావతి వరకూ ఐదు కిలోమీటర్ల పరుగు సాగుతుందని పేర్కొన్నారు.

12న ముగ్గుల పోటీలు

మందస,జనవరి9 (ఆంధ్రజ్యోతి): మందస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కరించుకుని ఈనెల 12నఉదయం 10గంటలకు సత్యసాయి బృందావన్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పూన ఈశ్వరరావు, వడ్డి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9494588963, 9949756659కు సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ ఏఈగా మురళీమోహన్

టెక్కలి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): టెక్కలి మండల విద్యుత్ శాఖ ఏఈగా దాసరి మురళీమోహన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన శ్రీకాకుళంవిజిలెన్స్ విభాగం నుంచి బదిలీపై వచ్చారు.

గున్నయ్యకు ఘన నివాళి

కాశీబుగ్గ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ జడ్పీ పాఠశాలకు స్థలాన్ని దానం చేసిన పెంట గున్నయ్య 116వ జయంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయన కుటుంబ సభ్యులు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పెంట రత్నాకర్, హెచ్ఎం చిన్నంనాయుడు, నరసింగరావు, రమణమ్మ, సుధాకర్, లవకుమార్, శ్రీధర్, సాయిరాం, శ్రీను, కృష్ణప్రసాద్, జోగేంద్ర, చక్రి పాల్గొన్నారు.

రబీకి వంశధార నీరందించాలి

హిరమండలం, జనవరి 9:(ఆంధ్రజ్యోతి):రబీకి వంశధారప్రాజెక్టు ద్వారా నీరందించాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన మండలపరిషత్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్పీటీసీ పి.బుచ్చిబాబు మాట్లాడుతూ ఖరీఫ్‌లో ధాన్యం సొమ్ము 24గంటల్లో రైతుల ఖాతాల్లోకి జమచేసి వారి కళ్లల్లో ఆనందం నింపిన ఘనతకూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌ను ఎంపీడీవో కాశీప్రసాదరావు చదివి వినిపించారు.ఆదాయం రూ.54,60,72,280 కాగా వ్యయం రూ.53,55,93,520గా అంచనావేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయం రూ.50,96,39,500 కాగా వ్యయం రూ.50,53,50,230 జరిగినట్లు చెప్పారు. సమావేశంలో తహసీల్దారు హనుమంతురావు పాల్గొన్నారు.

శిక్షణతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి

● గ్రామీణ ఖాదీ, ఉపాధి పరిశ్రమల శాఖ ఏడీ షేక్


మాట్లాడుతున్న ఏడీ షేక్

హరిపురం, జనవరి9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో శిక్షణతోనే యువతకు స్వయం ఉపాధి లభి స్తుందని గ్రామీణ ఖాదీ, ఉపాధి పరిశ్రమల శాఖ ఏడీ షేక్ తెలిపారు. మందస మండలంలోని బహా డపల్లి గ్రామ సచివాలయ భవనంలో జర్జంగి జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ 30 రోజులపాటు యువతకు మొబైల్ రిపేరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు ఇచ్చి పీఎంఈజీపీ పథకంలో రుణసౌకర్యం కల్పించి ఆర్థిక భరోసా నిర్వనున్నట్లు చెప్పారు. దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కూర్మారావు, పీవోలు నాగరాజు, ఏవో రామారావు, నాగేశ్వరరావు, మణికంఠ, వీవోఏలు శశిరేఖ, మాధవ్, భీమారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై బురదచల్లడం తగదు

పలాస రూరల్, జనవరి9(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు భూములను ఆక్రమించేందుకు ఇచ్ఛాపురానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు కుట్రపన్నుతున్నారని, ప్రైవేటు భూములపై రాజకీయాలు చేస్తే సహించేది లేదని టీడీపీ మండలాధ్యక్షుడు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుమ లక్ష్మణకుమార్ తెలిపారు. ఈ విషయంలో ఎమ్మెల్యేపై బురదచల్లడం తగదన్నారు. గురువారం మండలంలోని రామకృష్ణాపురంలో కుత్తుమ లక్ష్మణ కుమార్, ఆయన వద్ద భూములు కొనుగోలు చేసిన వారితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రామకృష్ణాపురం గ్రామరెవెన్యూ 143 సర్వే నెంబరులో ఉన్న ఈ భూమి విషయంలో ఇటీవల ఇచ్ఛాపురానికిచెందిన వైసీపీ నాయకుడు పలాస ఎమ్మెల్యేశిరీష, ఆమె భర్త వెంకన్నచౌదరిపై అభాండాలు వేశారని,అనవసరమైన విషయాల్లోకి ఆమెను లాగడంసరికాదని, నిజాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు.

ఇది రైల్వే బాదుడు!

(మూడో పేజీ తరువాయి)

మీనమేషాలు లెక్కిస్తోంది. వందేభారత్ వంటి బుల్లెట్ రైళ్లు ప్రవేశపెట్టామని చెబుతున్న రైల్వేశాఖ.. అందులో గ్రామీణ ప్రాంత ప్రజలు ఎంతవరకు రాకపోకలు సాగిస్తున్నారన్నది మాత్రం గుర్తించడం లేదు.

టిక్కెట్ల ధరలు పెరిగాయి..



గతం కంటే రైళ్ల టిక్కెట్ల ధరలు పెరిగాయి. అప్పట్లో తక్కువ డబ్బులతోనే మాలాంటి పేదవారి ప్రయాణాలు సాగేవి. ఇప్పుడు జనరల్ బోగీలు తగ్గించారు. రిజర్వేషన్ చేసుకుందామంటే అదనపు బాదుడు తప్పడం లేదు. టిక్కెట్ ధర ఒకలా ఉంటే.. ముందస్తు బుకింగ్‌లో మరోలా చూపిస్తోంది. అవసరం అనుకున్న వారు తప్పక బుక్ చేయాల్సిన పరిస్థితి.

-నందికి జాని, ప్రయాణికుడు, ఇచ్ఛాపురం

చాలా దారుణం..



గతంలో రైలు అంటే పేదవాడి వాహనం. కానీ, ఇప్పుడు పెద్దల వాహనంగా మారిపోయింది. టిక్కెట్ల ధరలు రకరకాలరూపంలో పెంచేస్తున్నారు. మనుషుల అవసరాన్ని అడ్డగోలుగా దోచేస్తున్నారు. ప్రీమియం, తత్కాల్ టిక్కెట్ల పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇది చాలా దారుణం.

-కాళ్ల దిలీప్, ప్రయాణికుడు, ఇచ్ఛాపురం